# 'మనిషి' కథ

కిషన్

'ఎవరు ……ఎవరక్కడ?'—

ఆ గొంతుక ఖంగుమని శంఖారావంలా ధ్వనించింది……

'నేను ……నేను మనిషిని'

జవాబు అణుకువగా ఉంది. స్వరంలో నిజాయితీ—ఆత్మస్థైర్యమూ ఉన్నాయి. మల్లెలు విచ్చుకుంటూన్నట్టు, నక్షత్రాల పుష్పొడి ప్రాగ్దిశా మండపంపై వెల్ల వేస్తున్నట్టు చైతన్య ప్రకాగడాలు ముట్టించినట్టు. లోకాన్ని ప్రభావితంచేసే ప్రాతఃకాలపు కాంతి తాలూకు సవ్వడి ఆ గొంతుకలో ఉంది.

'నిజమా? నిజమేనా?……నీవు నిజంగా మనిషివేనా?' ప్రశ్న వెనక భాగాన రెండు కండ్లు మిలమిలా మెరిశాయి.

మనిషి పలకలేదు — అయోమయంగా ఆ కళ్ళవేపు చూశాడు. అవిరెండూ ఉషఃకాంతుల్లో ప్రభావిత మౌతూన్న రెండు కాసారాల్లాగున్నాయి. క్రిమేపీ వాటి ప్రకాశం పెరిగిపోతున్నది.

మీరు నన్ను చూస్తున్నారు—ఐనా నన్నెవరని ప్రశ్నిస్తున్నారు. మీరింతకు ముందు మనిషిని చూసి ఉండలేదా?'

జడుసుకున్న పసివానికి ధైర్యం చెపుతూన్నట్టు నవ్వు వినిపించింది— శాంతి పక్షిరెక్కల్లాఉన్న ఆ కళ్ళల్లో కూడా నవ్వు కన్పించింది. ఆ కనుకొలుకుల్లోంచి జాలి ఏ క్షణాన్నైనా పాల చుక్కల్లా జారి ప్రపంచంమీద జల్లుగా పడనున్నదేమో అనిపించింది మనిషికి …ఐనా అవి ప్రేమగా నవ్వుతూనే ఉన్నాయి.

'లేదు—కాని నిన్ను పోలిన జంతువులను అనేకం చూశాను. చూస్తున్నాను. సృష్టిలో ఎన్నో రకాల జంతువులను చూశాను. చూస్తున్నాను. ఏనుగు,—కోతి,—పులి ఇవెట్లా ఉంటాయో నీకు తెలుసునా?'

మనిషి విస్మయంలో అవాక్కయ్యాడు. ఇన్ని శతాబ్దాలుగా తన పూర్వీకులు సృష్టిలో తమ మేధను లడాయించి ఆక్రమిస్తూన్న నాగరికతకు వారసుడు తనా?

అంటే ఎన్నోరకాల జంతువుల్లాగే తనూ ఒక మృగప్రాయుడేనా?— ఐనా మనిషికి కోపం రాలేదు.

ఆ స్వరంలో మార్దవం ఉంది. వ్యంగ్యంలేదు. అవహేళనలేదు. దూషణలేదు— ఏదో పోగొట్టుకొన్న వస్తువేదో దొరకనున్నదన్న ఆశఉంది. అందువల్లనే మనిషికి కోపం రాలేదు.

'మీరు పొరబడుతున్నారనడానికి సాహసిస్తున్నాను' తనకు తెలువకుండానే వినమ్రుడౌతూ మనిషి జవాబుగా అన్నాడు. 'నన్ను పోలిఉన్నవాళ్ళంతా నా బంధువులు. నాతోటివాళ్ళు— వాళ్ళంతా జంతువులైతే నేనొక్కణ్ణిమాత్రం మనిషి నెట్లా?'

మనిషికి క్షణం తర్వాత బాల సూర్య ప్రభల్లాగున్న ఆ రెండు కళ్ళు రెప్పలు మూసుకుంటూ కన్పించాయి. రెండు క్షణాలపాటు ప్రకృతి కుత్తుకమీద నిశ్శబ్దం కత్తులు ఆన్చింది. ఆ తర్వాత చను మొనలు కోసేసిన కొండలు పెడ బొబ్బలు పెడుతూన్నట్టు 'నేనొక్కణ్ణి మాత్రం మనిషినెట్లా?—నేనొక్కణ్ణి మాత్రం మనిషినెట్లా?' అంటూ ప్రతిధ్వనులు విన్పించినై—

మనిషి అయోమయంగా చూశాడు చుట్టూ.

కాని ఎక్కడా ఏమీ కన్పించడంలేదు. ఎక్కడా చీకటిలేదు—ఎదురుగా ఉన్నది ఆకాశంకాదు — కాని గోచరమౌతూన్న వస్తువేమిటో పోల్చుకో రావడంలేదు. వెలుతురు లేదనా?— ఎదురుగా శూన్యమా? కాదు. లోకమంతా ఉన్నట్టున్నది?— తను జాగ్రదవస్థలో లేడా? విన్పిస్తున్న ధ్వనులకర్థమేమిటి?—

ఇది మాయా?— ఎక్కడున్నది మాయ?— ఇది మాయాకాదు దైవమూ వగైరా అంతకన్నా కాదు.

తనలో సహజమైన చైతన్యం నశిస్తున్నట్టున్నది— ప్రేరణలేదు— ఉద్రేకంలేదు— పోరాటంచేయమని బుసకొడ్తున్న జీవకణాలుకావు తనవి— ఎవడో మహానాయకుడి కోసం తుపాకులువాల్చి అంత్య నమస్కారాలు చేస్తున్న సైనికుల్లా ఉన్నాయి ఇవి.

కాని ఎట్లా?—

ఎట్లా?—

మనిషి ఆర్చి గొంతెత్తి అరిచాడు— అది ఆక్రందన కాదు— కార్యోన్ముఖుడు వేసిన పొలికేక—

నువ్వు — నువ్వెక్కడ? నన్ను జంతువుల జాతివాణ్ణిగా జమకట్టి — నా జ్ఞానేంద్రియాల మీద నీ అభిప్రాయాల తెరలు దించాలనుకున్న నీవెక్కడ?—

'ఏం-భయపడుతున్నావా?'

'కాదు—'

'ఉక్రోషమా?'

'నేను కన్పిస్తే—నా మీద పగతీర్చుకుందామనా?'

'నాకు పగల్లేవు—నేను మనిషిని'

'మరెందుకు?'

'నన్ను పోలిన జంతువులననేకం చూశానన్నావ్—ఏరీ? మా వాళ్ళంతా ఏరీ— నేనొక్కణ్ణే ఇక్కడ—'

'ఒద్దు—వాళ్ళంతా జంతువులైపొయ్యారు—వాళ్ళతో నీకేంపని — నీవిక్కడే ఉండు—'

మనిషి నిర్వికారంగా నవ్వి అన్నాడు 'ఒంటరితనం నన్ను మాత్రం మనిషిగా ఉంచుతుందా—'

'వాళ్ళంతా కలిసే ఉన్నారు—మరి వాళ్ళంతా అట్లా ఎందుకయ్యారు?'

'నీకు తెల్సు—'

'ఔను నాకు తెలుసు ...'

'అదేమిటో చెప్పు ...'

జవాబుగా తిరిగి నిశ్శబ్దం. అంతులేని ఆ ప్రదేశమంతట చీమ జారిపడితే విన్పించేటంత నిశ్శబ్దం. క్రమేపీ దూరం నుండి నడచివస్తున్నట్టు వస్తున్న శబ్దాలు.

ఎన్నో వేలమంది భయంగా ఊపిరి పీలుస్తున్నట్టు.

నిద్రాభంగమౌతుంది—కొస్త చప్పుడు తగ్గించి మ్రోగకుంటే ఎముకలగూడు చెదిరిస్తే భయం భయంగా బాదుకుంటూన్నట్టు గుండెలుచేసేలబదిణలు. ఎన్నోవేలు.

నోట్లో గుడ్డలు కుక్కబడిన ఇల్లాలు ప్రసవ వేదన పడుతూన్నట్లు — ఏవో రవరవలు—

సన్నగా—

భయం భయంగా—

నిస్సాహసంగా

రోషంచచ్చి—పౌరుషంచచ్చి .. వివేకం పెదిమలకు దారాలు కట్టి—

కర్తవ్యపు వెలుగు దీపాల మీద అవసరాల అవగుంఠనాలు వేసుకొని—
నక్కి——నీల్గి....

అంతదాకా ఆడిస్తూన్న ప్రహసనంలో మూగవాళ్ళు చెవిటివాళ్ళు ప్రేక్షకులుగా చేరినట్లు......

ఏదో వేసుళ్ళాడుతూంది ... ఏమిటా సవ్వడి?

మనుషులంతా మూక ఉమ్మడిగా పరుగెత్తి భూమిపుండులో బోర్లాపడిపోయినట్లు

ఉండీ ఉడిగీ ఏమిటో పెద్దగా విన్పిస్తున్నాయి.

—ఏమిటా ధ్వనులు?

ఎవడో ఎవతితోనో 'సరస'మాడుతున్నాడు.

'అబ్బ! మోటుగా—' బేరంలో అన్నీ మంచి కూరగాయలే ఏరుకుంటూన్నట్లు—

జవాబుగా నవ్వు—సహజజ్ఞానంలోపించిన దర్పంతో—

.... .... .... .... ....

ఎవడో అమ్ముడు బోతున్నాడు—

'మీ కాళ్ళకింద బతికేటోళ్ళం—రేపు ఏ అక్కరైనా మీతోనే. మిమ్మల్ని కాదని పోతమా?—

'ఇదిగో—ఈ పది ఉంచు—'

'ఎందుకు బాన్సెను—ఒద్దు—'

'ఆఁ—అట్లనకు—మనకిదో లెఖ్ఖా—ఉంచు'

.... .... .... .... ....

ఎవరో ఏడుస్తున్నారు—ఎవరో బెదిరిస్తున్నారు.

'వోడికెల్లి తేవాలి పైకం—'

'నన్నడుగుతే ఎట్లాచెప్ప—

'మిమ్మల్నడుగొద్దాయె—ప్రతిదానికి ఇంతింత పైకమాయె—ఎట్లమొత్తుకొనేది— ఏడజచ్చేది. కొనబోతె కొరివి—అమ్మబోతె అడివి ...'

'అపు నీ సోది—వానివి జప్తుచేయి—ఎహే కరో—వహే కరో—'

'ఏ సేస్—ఇమ్మీడ్యట్'

ఎవడో చెప్పులు మోస్తున్నాడు

.... .... .... .... ....

'.......ప్రజా హృదయాధిపీఠా! యువజన చకోరా.......!.......... నీవు చేసిన ప్రజామేలు ఎన్నటికీ మరువలేనిది. నీవు మా ఊరు వేంచేయుట మేం చేసుకొన్న పుణ్యం.'

పగటి దోపిడి జరుగుతూంది.

'కిలో తిండి గింజలు—అయిదు రూపాయలు'

'కిలో గింజలో?—'

'మూడు రూపాయలు—'

'గజం గుడ్డ?'

'మేలురకం పదిరూపాయలు....,

'ఒద్దు— ముతకరకం'

'దొరకదు....కంట్రోల్ క్లాత్ అది'

చేతులు చాటుచేసుకనడుస్తూన్నట్టు ధ్వని....

'ఆకలి—'

.... .... .... .... ....

'కష్టంచేసుకొని కడుపునింపుకోలేవూ?'

'దొరకడం లేదు ..'

'తిరుగుబాటుచేయలేవూ.'

'నేనొక్కణ్ణా'

'ఔను ...నీ వొక్కడివే .. ఎట్లాగుమరి?'

.... .... .... .... ....

ఎక్కడో్న వరిగడ్డి మంటలు వేసినట్టు ఏవో అరుపులు .. టపటప ధ్వనులు-- గోలలు—నిశ్శబ్దం ..

ఎవడో పర్ గెడుతూన్న చప్పుడు ...

ఏదో మెత్తని పదార్థం విరిగిపడ్తూన్న ధ్వనులు .. బహుశా సముద్రపుటలలు....

'ఎవరా పరుగెత్తేది ...'

'ఆగు! ఆగు! అది సముద్రం'

'అరెరె ఆత్మహత్య చేసుకుంటావా?'

'ఆగవయ్యా! ఆగు—అబ్బ నీతో నూరుగురు'

'—ఏమిటీ నాతో నూరుగురా?'

'ఔను నూరుగురు—కాని వాళ్ళు నూరుగురే ఐతే .... కాక కేవలం నూరుగురే ఐనా.... ఈ ప్రయత్నంవాళ్ళు చేసినందుకు విచారించేవాణ్ని కాదు—కాగా బ్రతికించినందుకు సంతోషించేవాణ్ణి—కాని వాళ్ళునూరుగురు కాదు—వాళ్ళు లక్షలు—కోట్లు—అందుకే అయోమయంగా ఉంది.'

'ఆదేమిటి లెఖ్ఖ—'

'నీవెందుకు చావబోతున్నావ్ '

ఏం చెయ్యను-పంటలులేవు-వసతుల్లేవు.... అన్నీ ఉన్నోరికే — ఉన్నోళ్ళు వేయికొక్కరు. వసూళ్ళ అప్పులు కట్టలేం— వలసొచ్చాం—పనిలేదు. యజమానిలో నిజాయితి లేదు— సరుకులు నిప్పుకన్నా వేడిగా ఉన్నాయి. చద్దామనుకున్నాను—ఇంకెందుకు బతికేది—?

'ఔనా—నీవలెనే వాళ్ళంతాగూడా—ఎన్నోరకాల మనుషులు—అందరూ అట్లాగే కష్టాలు సహించలేక జీవితంమీద రుచిచచ్చి చచ్చిపోదామని వచ్చారు — నీ వంటి రైతులు లక్షలు—ఆయన వంటి ఉద్యోగస్తులు లక్షలు—ఆ కూలీలు లక్షలు—అందరికీ ఒకే బాధ—ఆకలి—గుడ్డ గూడు—'

మళ్ళీ నిశ్శబ్దం—ఏదో అంతవరకు బుసగొడుతున్న జంతువు కంఠ నాళం తెగిపోయినట్లు.

దీర్ఘాలోచనా నిమగ్నుడైన మనిషిముందు విస్ఫులింగాల్లా మెరుస్తున్న రెండు కళ్ళు! అవినవ్వుతున్నాయ్.

మనిషికోలుకున్నాడు.

ఎదురుగా ఆ కళ్ళు!

'ఇప్పుడు నీవు విన్న నవ్వది ఏమిటి?—

'వాళ్ళందరూ నా వాళ్ళు .. నా మనుష్యులు'

'ఇంకా మనుష్యులుగానే భ్రమపడుతున్నావా,? కాదు జంతువులు. జంతువులు కూడాకాదు. అవి ఎన్నో విషయాల్లో మెరుగు....'

'నిజం—' మనిషి ఒప్పుకున్నాడు'

'పండిస్తున్నారు కాని తినడంలేదు. నేస్తున్నారు .. ... కాని కట్టడంలేదు. ఇళ్ళుకడుతున్నారుకాని మేనువాల్చడంలేదు. ప్రేవులు ఆకలి ఆకలి అంటూంటే నోరులేనిపశువులా ఈడ్చుకపోతున్నారే శరీర భారాన్ని తప్ప—ఈ జీవితాన్ని ఎంతో మెరుగ్గా

బతికించే చైతన్యం జోలికి పోవడంలేదు. వాళ్ళంతా ఆత్మవంచితులు. తమనితాము–వంచనచేసుకొని జీవిస్తున్నారు .. ఆకలి .. వేదన .. వంచన ఈ లక్షణాలు మనం వేరే మృగాల్లో చూడంకదూ ...'

"ఆపు" మనిషి గొంతును గుహచేసి అరిచాడు.

ఆ అరుపులో కసిలేదు–క్రోధంలేదు. సుళ్ళుతిరుగుతూన్నవ్యథ ఉంది. ఈనాటి వరకూ ఘూమ్మీరి ఏదురంతాన్ని విన్నవాడు గూడా పెట్టనికేక అది.

తర్వాత నెమ్మదిగా అన్నాడు 'వాళ్ళందరూ ఎందుకిట్లా చేవచచ్చి జీవిస్తున్నారు. కేవలం యాంత్రికంగా .. పోరాటంలేదు. తిరుగుబాటులేదు .... కోరికల్లేవు .... ఐతే మరి.... ఐతే మరి ఇంకెందుకు జీవిస్తున్నట్టు... మరి చస్తే ...అట్లాఅర్థం లేకుండా— ఎక్కడా ఈ లోపం?

"అందుకే నీవు మనిషి వన్నాను .......నీలో ఆలోచన ఉంది. నీకు ప్రాణం మాత్రమేకాదు–నీలో జీవం ఉంది—కాని . నీ కర్తవ్యం మాత్రం....ఎంతో కఠినమైంది. ఎంతో ప్రయాసతో కూడుకుని ఉంటుంది... మనిషి ముఖంలోని కండరాలు సమర్థతతో బిగుసుకుపోయాయి.

సంద్రంలో జారిపోయిన నల్ల పూసను వెతికి తీసినట్లు—

విరిగి తునకలైన వెలుతురు కిరణాల్ని అతుకుతున్నట్టు....

నరనరాల్లోకి కవోష్ణ రక్తానికి బదులు ఏకులుకూరుకుపోయినపైన నిస్సారుల్లోకి ఉడుకునెత్తురునెక్కిస్తూ ....

తరతరాలుగా కురుస్తూ పేరుకుపోతున్న ఈ మౌఢ్యపు బురదలోంచి నీళ్ళని పైకిలాగి....

"ఔనౌను" మనిషి ఖుషీగా గెంతాడు.

కంచు విగ్రహంలా కాకలు తీరసాగాడు.

క్రమేపీ పరిసరాల్లో మార్పురాసాగింది. అయోమయస్థితి తొలిగి. దట్టంగా పారుతున్న పొగలమధ్యనుంచి ఎర్రని నిప్పుపూలు తొంగిచూస్తున్నట్టు .... శతాబ్దాల వంధ్యత్వం పిదప ప్రకృతి పుష్పవతి ఐనట్టు .... క్రమేపీ జగత్తు ముఖంలో జీవకళ త్రొక్కిసలాడింది.

" సంద్రంలో .........."

మనిషి. పోగొట్టుకొన్న తనతోటివారి హృదయాల్ని వెదికి సమకూరుస్తున్నాడు.

మతమనీ . కులమనీ . నలుపనీ ... తెలుపనీ .... ఎక్కడికక్కడికి తెగి— చీలి — కూటాలై — గుంపులై — అరటి బోదెలోని పాయల్లా అసంఖ్యాకంగా విభజించబడిఉన్న మానవ సమూహాల్ని ప్రేరేపించి జీవన చైతన్యాన్ని ప్రబోధించి ఎంటులా పేనుకున్నాడు.

.... .... .... .... ....

శతాబ్దాల దాసత్వంతో చచ్చి నిస్సారమైన జీవాణువుల్ని తొలిగించి కొత్త ప్రోటజోవాలనెక్కించి—బ్రతుకు సాహసమనీ — బ్రతుకు శీలమనీ — బ్రతుకే చైతన్యమని బలం మందు తాగిస్తున్నాడు.

.... .... .... ....

శతాబ్దాలుగా స్వార్థులు అల్లిన మూఢనమ్మకాల సాలె గూడుల్లో చిక్కుకు పోయిన సోదరుల సంకెళ్ళు త్రెంచి వారిచెవుల్లో జీవన వేదం పఠిస్తున్నాడు.

అందుకే ఆ వెలుతురూ చీకటీ కాని మాయ—అందుకే ఆ బ్రతుకూ చావూ కాని రౌరవాలు—విడిపోతున్నాయి.

కొత్త కంఠాలు సవరించుకుంటున్నాయి.

కొత్త ప్రాణాలు సిద్ధపడుతున్నాయి.

అదుగో! అక్కడ తూర్పున ఎర్రగా సూర్యుడుదయిస్తున్నాడు. ఇక ఈ నవ జనతావాహిని ఆగదు — స్వార్థసర్పంకాటువేసి నాలుకరుచులు తప్పిన తిరోగమన వాదుల్లారా—! ఇక మీపని సరి!

మనిషి జంతువుకాడు—మనిషి మానవుడు!

★

మీరీ సంచిక చదువుతూ ఉండగానే
ఉగాది వస్తుంది.
మీ అందరికీ నూతన సంవత్సర
సృజనాత్మక శుభాకాంక్షలు.